‘డబుల్’ ఇళ్లెప్పుడిస్తరు సారూ..

- ఈ ఏడాదైనా సొంతింటి కల నెరవేరేనా?
- నత్తనడకన డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణాలు
- ఐదేళ్లు గడిచినా పూర్తికాని పనులు
- ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు
- పట్టించుకోని అధికారులు



రగుడులో నిర్మాణ దశలో ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

సిరిసిల్లఅర్బన్: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న ప్రభుత్వం సంకల్పం నేరవేరడం లేదు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడు శివారులో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి దాదాపు ఐదేళ్లు కావస్తున్న పనులు మాత్రం నత్తనడకన సాగుతున్నాయి. అధికారులు పర్యవేక్షణ లేక, పాలకులు పట్టింపు కరువై, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిర్మాణ పనులు ముందుకెళ్లడం లేదు. దీంతో సొంతింటిపై ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులు ఇంకా పూరిగుడిసెలో, కిరాయి ఇళ్లలోనే మగ్గుతున్నారు. ఇదిగో ఇస్తాం.. అదిగో ఇస్తాం అని పాలకులు చేప్పున్న మాటలు విని ఆశతో ఎదురుచూస్తున్నారు. నిరుపేదలు సొంతింటిపై పెట్టుకున్న ఆశలు సన్నగిల్లుతున్నాయి. అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.

రగుడు శివారులో 72 ఇళ్లు

సిరిసిల్ల మున్సిపల్ పరిధి రగుడు శివారులో 2018లో నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. 12 బ్లాక్‌లలో 72 ఇళ్ల నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే లబ్ధిదారులను డ్రా ద్వారా ఎంపిక చేశారు. దాదాపు ఐదేళ్లు కావస్తున్న పనులు మాత్రం పూర్తికావడం లేదు. కేవలం ఇళ్లు నిర్మించారే తప్ప అంతర్గత పనులు మాత్రం అలాగే వదిలేశారు.

నత్తనడకన పనులు

ప్రారంభంలో చకచక జరిగిన పనులు, ఆ తర్వాత పనుల్లో స్పీడ్ తగ్గింది. స్థానిక ప్రజాప్రతినిధులు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా నిర్మాణ పనులు వేగం పుంజుకునా, కొన్ని రోజుల తరువాత పనులు నిలిపివేశారు. నిర్మించిన ఇళ్లలో కరెంట్ సరఫరా, పెయింటింగ్, కిటికీలు, తలుపులు, తదితర మౌలిక సదుపాయాలను కల్పించలేదు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్, మంచినీటి సరఫరా, తదితర అంతర్గత పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి. ఏళ్లుగా పనులు నెమ్మదిగా సాగుతున్నా పట్టించుకున్న వారు లేరని లబ్ధిదారులంటున్నారు.

త్వరగా పూర్తి చేయాలి



ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు కేటాయించాలి. అధికారులు పర్యవేక్షణ లోపమే జాప్యానికి కారణం. దాదాపు ఐదేళ్ల నుంచి పనులు కొనసాగుతునే ఉన్నాయి. ఎప్పుడు పూర్తవుతాయో, మాకెప్పుడు కేటాయిస్తారో వాళ్లకే తెలియాలి. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి పనుల్లో వేగం పెంచాలి.

– బూర విష్ణు, రగుడు

కిరాయి దొరక్క వేరో ఊళ్లో ఉంటున్న



మాది రగుడు ఇక్కడ కిరాయి దొరక్కపోవడంతో మా అమ్మవారి ఊళ్లో నా పిల్లలతో కలిసి ఉంటున్నా. డబుల్ బెడ్రూం ఇళ్ల డ్రాలో నా పేరు వచ్చింది. కానీ ఇళ్లు కేటాయించలేదు. ఎప్పుడు ఇళ్లు కేటాయిస్తారో ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. ఇళ్లను తొందరగా కట్టించి గూడు కల్పించాలి.

– సిరిసిల్ల లక్ష్మి, రగుడు

త్వరలోనే అందజేస్తాం



త్వరలోనే ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేస్తాం. నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రోడ్లు, డ్రెయినేజీ, అంతర్గత పనులు మిగిలి ఉన్నాయి. నిర్మాణ జాప్యం గురించి సంబంధిత అధికారులకు తెలియజేశాను. త్వరలో పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.

– పోచవేణి సత్య, కౌన్సిలర్

క్లుప్తంగా

మొదటిసారి నార్మల్ డెలివరీతో ప్రయోజనం



మాట్లాడుతున్న డాక్టర్ మహేశ్‌రావు

వేములవాడఅర్బన్: మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ రేగులపాటి మహేశ్‌రావు అన్నారు. బుధవారం వేములవాడ ఏరియా అసుపత్రిలో నార్మల్ డెలివరీలపై అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ అసుపత్రిలో మొదటి కాన్పులో నార్మల్ డెలివరీ అయి ఆడబిడ్డ జన్మిస్తే ఉయ్యాల అందిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఏరియా ఆసుపత్రి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు చైతన్య, సింధు, జ్యోతి, భాగ్య పాల్గొన్నారు.

తపాలా సేవలు విస్తృతం



ప్రచారంలో పాల్గొన్న వెంకటేశ్వర్లు

సిరిసిల్లటౌన్: తపాల శాఖ సేవలు విస్తృతమయ్యాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పోస్టాఫీస్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ‘మన ఊరు..మన పోస్టాఫీస్’ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ప్రచారం చేపట్టి మాట్లాడారు. చిన్నమొత్తాల పొదుపులో పెట్టుబడులు పెట్టుకోవాలని, పోస్టల్ బ్యాంకింగ్ సేవలు, తపాల సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఆయనతో పాటు అధికారి దయానంద్ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంట పరిశీలన



పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మండల వ్యవసాయాధికారి కే.సందీప్ ఆధ్వర్యంలో వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్యా చీడపీడలను అరికట్టేందుకు నాటు వేసిన 14 రోజులు పిలక దశలో ఉన్న వరి పొలాల్లో ఎకరానికి 10 కిలోల కార్బోఫురాన్ 3జీ గుళికలు లేదా 8 కిలోలు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు వేయాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో వరి పొలాల్లో లార్వా దశలో వరి పైరుకు నష్టం రాకుండా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50ఎస్‌పీ 0.4 మిల్లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి చంద్రప్రకాశ్, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల గ్రామంలో బుధవారం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాబార్డు డీడీఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఏటీఎం కార్డుల ద్వారా డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఉపయోగించుకోవడంలో మోసాలకు గురవకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. క్రాప్, మహిళా గ్రూప్ లోన్లు గురించి టీజీబీ రీజనల్ మేనేజర్ గంగాధర్, వడ్డీ రేట్ల గురించి బ్యాంక్ మేనేజర్ సురేందర్ వివరించారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఉపసర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, ఖాతాదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సులభ శైలిలో ఆంగ్ల భాషా నైపుణ్యం

- రెండు పుస్తకాల ఆవిష్కరణ



అరవింద్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న శంకరయ్య

సిరిసిల్లకల్చరల్: సరైన మార్గదర్శనం, సరళ శైలిలో అధ్యయనంతో ఆంగ్ల భాషలో పట్టు సాధించవచ్చునని గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య అన్నారు. పట్టణానికి చెందిన డబ్బింగ్ కళాకారుడు జెఎస్ అరవింద్ రచించిన సెవెన్ స్టెప్స్ టూ లర్న్ ఈజీలీ.. ఇంగ్లిష్ పట్ల అపోహలు, భయాలు, పరిష్కారాలు అనే రెండు పుస్తకాల పరిచయ కార్యక్రమం బుధవారం కేంద్ర గ్రంథాలయ భవనంలో జరిగింది. ఆవిష్కర్తగా హాజరైన శంకరయ్య మాట్లాడుతూ సులభ శైలిలో రూపొందించిన ఈ రెండు పుస్తకాలు విద్యార్థులకు ఆంగ్ల భాష అధ్యయనం చేసే వారికి మార్గదర్శిగా పని చేస్తాయన్నారు. ఓవైపు కళాకారుడిగా, మరోవైపు భాషా నిపుణుడిగా రాణించడం గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి బుగ్గారెడ్డి, జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఎలగొండ రవి, మారసం కార్యదర్శి జిందం అశోక్, మల్లికార్జున్, మహేశ్, రాధాకిషన్, రాజుకుమార్, అంజన్‌రెడ్డి శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

బడీడు పిల్లల సంఖ్యపై కొనసాగుతున్న సర్వే



సర్వే చేస్తున్న నిర్వాహకురాలు జయలక్ష్మి

వేములవాడరూరల్/బోయినపల్లి: బడీడు పిల్లలను బడిలో చేర్పించేందుకు వేములవాడ అర్బన్, రూరల్ మండలంలో ఆమె బోయినపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో వేములవాడ భవిత సెంటర్ నిర్వాహకురాలు జయలక్ష్మి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ బొడ్డు తిరుపతి ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి పిల్లల సంఖ్యను నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయస్సులోపు బడి బయట పిల్లలను గుర్తించేందుకు సర్వే నిర్వహించినట్లు తెలిపారు.బడీడు పిల్లలు ఇంటిలో ఉండకుండా పాఠశాలలకు వెళ్లాలని అవగాహన కల్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి–సారంపల్లి టెక్స్‌టైల్ పార్కు క్లాత్ మానుఫాక్చరర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను బుధవారం పవర్లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ ఆవిష్కరించారు. అధ్యక్షుడు అన్నల్దాస్ అనిల్‌కుమార్, డీవో ముజాహిద్, కార్యవర్గసభ్యులు ఎల్లె లక్ష్మీనారాయణ, దుబాల మొండయ్య, బొద్దుల వేణు ప్రసాద్, ఆడెపు సూర్య పాల్గొన్నారు. **సిరిసిల్లఅర్బన్:** సిరిసిల్ల మున్సిపల్ పరిధి రాజీవ్‌నగర్‌లోని మండల ప్రాథమిక పాఠశాలలో టీఆర్‌టీఎఫ్ క్యాలెండర్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శి బుర్ర కృష్ణప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. సిరిసిల్ల మండల అధ్యక్షుడు పోతుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజం, గాజెంగి విష్ణు, వెంకటేశ్వర్లు, శైలజ, శ్రీలత, భ్రమరాంబిక, స్వర్ణలత, వైష్ణవి, దీక్షిత, సుప్రియ ఉన్నారు.

వైభవంగా ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న జిందం కళ

సిరిసిల్లటౌన్: మున్సిపల్ పరిధిలోని మూడో వార్డులో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవం మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, అర్చకులు కృష్ణమాచారి, రంగాచారి, ఆలయ కమిటీ చైర్మన్ రమేశ్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీగోదా రంగనాథుల కల్యాణం



రంగనాథుని కల్యాణంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

వేములవాడరూరల్: మండలంలోని ఎదురుగట్ల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీగోదారంగనాథుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోయినేని కరుణాకర్–లహరి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ స్వామివారికి ప్రత్యేక మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, ఆలయ చైర్మన్ తిరుపతి, పాలకవర్గసభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ గురుకులాలు



బెడ్స్, బ్యాగులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: కార్పొరేట్‌కు దీటుగా సీఎం కేసీఆర్ ప్రభుత్వ గురుకుల విద్యాలయాలను తీర్చిదిద్దారని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. ముస్తాబాద్ సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన బెడ్స్, బ్యాగులు, బెల్టులను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి రూ.లక్షన్నర వ్యయం చేస్తోందన్నారు. ఆధునాతన సౌకర్యాలు, నాణ్యమైన విద్య, భోజనం అందిస్తుందన్నారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, సెస్ మాజీ డైరెక్టర్ విజయరామారావు, ప్రిన్సిపల్ ఉదయ్‌కుమార్, స్కూల్ కమిటీ చైర్మన్ సురేందర్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగ రహిత కళాశాలగా మార్చుతాం



మొక్కలు నాటుతున్న అధ్యాపకులు

గంభీరావుపేట: స్థానిక ప్రభుత్వ పీజీ అండ్ డిగ్రీ కళాశాలను ప్లాస్టిక్ వినియోగ రహిత కళాశాలగా మార్చుతామని ప్రిన్సిపాల్ పిట్ల దాసు అన్నారు. బుధవారం కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఆవరణలో విద్యార్థులు, అధ్యాపకులు కలిసి ప్లాస్టిక్ కవర్లను, చెత్తాచెదారాన్ని తొలగించి వివిధ రకాల పూల మొక్కలను నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీవల్లి, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన సెస్ చైర్మన్



సెస్ చైర్మన్‌కు స్వాగతం పలుకుతున్న ఎంపీపీ

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండల ప్రజాపరిషత్ సొంత భవనాన్ని బుధవారం సెస్ చైర్మన్ చిక్కాల రామారావు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీపీ మానస పూలమొక్కను అందించి స్వాగతం పలుకగా, పాలకవర్గం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జంగిటి అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ బండి దేవదాస్, వైస్‌చైర్మన్ రమణారెడ్డి, ఎంపీటీసీలు బుస్స స్వప్న, సిలివేరి ప్రసూన, కరికవేని కుంటయ్య, ములిగె దుర్గాప్రసాద్, గుగ్గిళ్ల లావణ్య, ఉపసర్పంచ్ పెద్దూరి తిరుపతి, మాజీ ఎంపీపీ పూసపెల్లి సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం ఈ ఉపాధ్యాయుడు



టై, బెల్టుల పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట: స్థానిక జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి అదే పాఠశాల విద్యార్థులు 300 మందికి తన సొంత ఖర్చులతో టై, బెల్టులు కొనుగోలు చేసి బుధవారం అందజేసి ఆదర్శంగా నిలిచాడు. కార్యక్రమంలో హెచ్ఎం దబ్బెడ హన్మండ్లు, ఎస్ఎంసీ చైర్మన్ అఫ్జల్ షహనాజ్, లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ నంది కిషన్, అధ్యక్షుడు రవీందర్, కోశాధికారి భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ రజిత, ఎంపీటీసీలు నాగరాణి, అనసూయ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఆయనను అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



వంటను పరిశీలిస్తున్న ఎంఈవో రఘుపతి

కోనరావుపేట: పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో తయారు చేయాలని ఎంఈవో దూస రఘుపతి కోరారు. కోనరావుపేట మండలం నిజామాబాద్, కొలనూర్ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల కోసం తయారు చేసిన వంటకాలను తనిఖీ చేశారు. హెచ్ఎం సత్తు రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోయినపల్లి మోడల్‌స్కూల్‌లో తహసీల్దార్..

బోయినపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలను తహసీల్దార్ దర్పెల్లి నరేశ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ మెనూ ప్రకారం పరిశుభ్రతతో వంటలు చేయాలని ఆదేశించారు.

రాజన్నపేటలో సర్పంచ్

ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ దత్తత తీసుకున్న రాజన్నపేటలో సర్పంచ్ ముక్క శంకర్ మధ్యాహ్న భోజనాన్ని బుధవారం పరిశీలించి, ప్రధానోపాధ్యాయులు, పిల్లలతో కలిసి భోజనం చేశారు.

‘ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు’

వేములవాడఅర్బన్/వీర్నపల్లి/ముస్తాబాద్/బోయినపల్లి/ఎల్లారెడ్డిపేట: మంత్రి కేటీఆర్ ప్రధానమంత్రి మోదీ, రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ మీద చేసిన అనుచిత వాఖ్యలను వేములవాడ అర్బన్, వీర్నపల్లి, ముస్తాబాద్, బోయినపల్లి ఎల్లారెడ్డిపేట బీజేపీ మండల అధ్యక్షులు చింతపల్లి వెంకటేశ్వర్‌రావు, గునుకుల దేవేందర్‌రెడ్డి, కస్తూరి కార్తీక్‌రెడ్డి, గుడి రవీందర్‌రెడ్డి, పొన్నాల తిరుపతిరెడ్డి ఖండించారు. ఆయా మండలాల్లో విలేకరుల సమావేశాల్లో వారు మాట్లాడారు. బీజేపీ అంటే మంత్రి కేటీఆర్‌కు భయం పట్టుకుందని, అందుకే అలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. మిడ్ మానేరు నిర్వాసితుల ఇళ్ల నిర్మాణాలకు రూ. 5.04 లక్షలు ఇస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు.ఏ ఒక్క హామీ నిలబెట్టుకోలేదని అన్నారు. వచ్చే ఎన్నికలో బీజేపీకి సినిమా చూపిస్తానని చెప్పడం హస్యాస్పదంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పి పూర్తి సినిమా చూపిస్తారన్నారు. సమావేశాల్లో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు చింతపల్లి మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి బుర్ర శేఖర్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీలుగా మార్చే వరకు పోరాటం ఆగదు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్‌లో విలీనమైన ఏడు గ్రామాలను గ్రామపంచాయతీలుగా మార్చే వరకు పోరాటాలు చేస్తామని విలీన గ్రామాల ఐక్య వేదిక చైర్మన్ బొల్గం నాగరాజ్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో ప్రజలకు ఇష్టం లేకున్నా ఏడు గ్రామాలను సిరిసిల్లలో మున్సిపల్ కలిపారని, నాటి నుంచి నేటి వరకు ప్రజలు ఎన్నో ఇబ్బందుల ఎదుర్కొంటున్నారన్నారు. పన్నులు భారం పెరిగి, ఉపాధి హామీ పోయి, ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఇందులో భాగంగానే విలీన గ్రామాల ఐక్య వేదిక నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కన్వీనర్‌గా సలేంద్రి బాలరాజ్, సలహాదారుడు చెన్నమనేని కమలాకర్‌రావు, సభ్యులుగా ప్రశాంత్, వంగ అనిల్‌కుమార్, లింగంపల్లి మధుకర్ ఎన్నుకున్నట్లు తెలిపారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

గంభీరావుపేట: విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ నాయకులు బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం వడ్డించాలని, పాఠశాలలు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని, వారానికోసారి పాఠశాలలను తహసీల్దార్ సందర్శించాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమం ప్రారంభం

బోయినపల్లి: మండలంలోని కొదురుపాక హైస్కూల్‌లో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై బుధవారం ఏర్పాటు చేసిన 21 గంటల శిక్షణ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ ప్రారంభించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం రంగనాథశర్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాస్టర్ ట్రైనర్ టీపీ స్వామి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ కత్తెరపాక సుధాకర్, అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

కోనరావుపేట: మండలంలోని నిమ్మపల్లికి డి.లచ్చవ్వకు రూ.24 వేలు, డి.రాముకు రూ.16 వేలు, రజియాబేగంకు రూ.17 వేలు, నవ్యకు రూ.16 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను టీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మల్యాల దేవయ్య బుధవారం అందజేశారు.

డెయిరీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కోనరావుపేట: కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మల్కపేట బీసీ పరిధిలో మల్కపేటకు చెందిన సోనవేని సౌజన్య (ప్రథమ), నిజామాబాద్‌కు చెందిన బార్గవి(ద్వితీయ) బహుమతులు సాధించినట్లు బీసీ ఇన్‌చార్జి జవ్వాజి ఎల్లాగౌడ్ తెలిపారు. అలాగే పాల సేకరణ విభాగంలో కొలనూర్ సంఘం(ప్రథమ), మల్కపేట సంఘం (ద్వితీయ) స్థానాల్లో నిలిచినట్లు వివరించారు. విజేతలకు బహుమతులు అందజేశారు.

నీరాపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

ఎల్లారెడ్డిపేట: నీరాపై అసత్య ప్రచారం మానుకోవాలని మండల గౌడ సంఘం అధ్యక్షుడు ముష్కం దత్తాద్రిగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ నీరా గురించి అవగాహన లేక మాట్లాడుతున్నారని అన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి బొల్గం రంగాగౌడ్, నారాయణ, ముత్తయ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులు పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని దుర్గమ్మ గుడి ఆలయాన్ని పునర్నిర్మాణం చేపడుతుండగా బుధవారం సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి పరిశీలించారు. గ్రామ దేవతైన దుర్గమ్మ ఆలయం సిరిసిల–కామారెడ్డి ప్రధాన రహదారిపై ఉండగా ఆలయ కమిటీ నూతన ఆలయ నిర్మాణ పనులను శరవేగంగా చేపడుతున్నారు. నంది కిషన్, లక్ష్మారెడ్డి, నర్సింహులు, రమేష్, బాల్‌రెడ్డి, మల్లారెడ్డి, హసన్, ఎల్లయ్య, హన్మయ్య పాల్గొన్నారు.